క్లుప్తంగా

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



మాట్లాడుతున్న చెన్నరాములు

నల్లగొండ టౌన్: ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని కళాశాలల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగనమోని చెన్న రాములు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే బీసీఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. ఈ 9న బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ అగ్రకుల పేదల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించను న్న రాజ్యాధికార చైతన్య సదస్సును విజయవ ంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో వంటిపాక యాదగిరి, యం.డి.రఫీ, సయ్యేద్, తాజోద్దీన్, పందిరి సైదులు, నాగార్జునా చారి పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

దేవరకొండ: నర్సరీల్లో మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని దేవరకొండ ఎంపీడీవో డానియల్ సూచించారు. సోమవారం దేవరకొండ మండల పరిధిలోని సూర్యతండా, మైనంపల్లి, కట్టకొమ్ముతండా, కొండభీమనపల్లి గ్రామపంచాయతీల్లో నర్సరీలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మొక్కలు ఎండిపోకుండా నీటిని అందిస్తూ ఉండాలన్నారు. ఇప్పటికే గ్రీన్‌షెడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

రేషన్ బియ్యం అక్రమ దందాకు చెక్



చింతపల్లిలో బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

చింతపల్లి: రేషన్ బియ్యం అక్రమ దందాను అడ్డుకునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ సోమవారం చింతపల్లి మండల కేంద్రంలోని రేషన్ షాపులు, బియ్యం అక్రమ రవాణా చేసే వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. సుమారు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారురి కొట్టే వెంకటేష్, ఎస్‌ఐ యాదయ్య పాల్గొన్నారు.

నాగన్నగౌడ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి



మాట్లాడుతున్న అంబటి సోమన్న

నల్లగొండ టౌన్ : ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న అన్నారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 40ఏళ్లుగా ఎంపీటీసీగా, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, పీసీసీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా, కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్న నాగన్న గౌడ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి గౌరవం కల్పించాలని కోరారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, జమాలొద్దీన్, అన్వరుద్దీన్, భిక్షం, వెంకన్న, శంభి రెడ్డి, సహదేవ్, మహమూద్, గౌస్ పాల్గొన్నారు.

స్కౌట్ మాస్టర్ నరహరికి నివాళి



నరహరి మృతదేహం వద్ద జెండా ఉంచి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

నల్లగొండ టౌన్ : స్కౌట్స్ అండ్ గైడ్స్ మాజీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మొలకల నరహరి అంతిమయాత్ర సోమవారం నిర్వహించారు. అంతకుముందు ఆయన ఇంటి వద్ద స్కౌట్ సైడ్ గైడ్స్ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు నివాళులర్పించారు. స్కౌట్ జెండా కప్పి మౌనం పాటించారు. జిల్లా నలుమూలల నుంచి ఆయన శిష్యులు స్కౌట్ బ్యాండ్‌లతో అంతిమ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణాలు అధ్యక్షుడు మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

స్వచ్ఛత ర్యాంకులో అభిప్రాయం కీలకం

- ఈనెల 25వ తేదీ వరకు గడువు
- కార్యాచరణ చేపట్టిన మున్సిపల్ శాఖ
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



మిర్యాలగూడలోని వార్డుల్లో చెత్త సేకరణ వాహనం

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అభిప్రాయాలను తెలియజేసేందుకు క్యూ ఆర్ కోడ్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పట్టణాల శుభ్రతపై సర్వే నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి మార్కులను వేయనున్నారు. 2024–2025గాను ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను ప్రారంభించారు. మున్సిపాలిటీలో ఓడీఎఫ్, వాటర్, సర్టిఫికేట్ ఉండగా దానిని కాపాడుకోవడంతో పాటు చెత్తను తగ్గించేందుకు చర్యలను చేపట్టారు. మున్సిపాలిటీలో పౌరుల నుంచి అభిప్రాయాలను తీసుకోవడం ప్రారంభించారు. ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కాగా మార్చి 25వ తేదీ వరకు స్వచ్ఛ యాప్ లేకుంటే స్వచ్ఛ భారత్ అర్బన్ వెబ్‌సైట్‌తో పాటు క్యూ ఆర్ కోడ్ ద్వారా కూడా అభిప్రాయాలను తెలపాల్సి ఉంటుంది.

మార్కులు ఐదు శాతం

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పౌరుల అభిప్రాయాలను తెలిపేందుకు స్వచ్ఛ యాప్ లేకుంటే స్వచ్ఛ భారత్ అర్బన్ వెబ్‌సైట్‌లో అభిప్రాయాలను సేకరిస్తున్నారు. మొత్తం మార్కుల్లో ఐదు శాతం ఈ విభాగానికి కేటాయించారు. దీని ఆధారంగా ర్యాంకుల ప్రకటన ఉంటుంది. పౌరుల అభిప్రాయాల సేకరణకు మున్సిపాలిటీలో కార్యాచరణ చేపట్టింది.

పది ప్రశ్నలు ఇవే..

- రోజు చెత్త సేకరించేందుకు మీ ఇంటికి/దుకాణానికి వస్తున్నా?
- మీ ప్రాంతానికి రోజు ఊడుస్తూ పరిశుభ్రంగా ఉంచుతున్నారా ?
- మీ ప్రాంతానికి సమీపంలో చెత్త కుప్పలు పేరుకుపోవడం వంటివి తరుచూ కనిపిస్తాయా ?
- ఇంటిలోని చెత్తను తడి, పొడిగా వేరు చేసి ఇస్తున్నారా ?
- స్వచ్ఛ ఆటోల వారు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా ? కలిపి సేకరిస్తున్నారా ?
- మార్కెట్లో, బజార్లు, పార్కులు, ఉద్యానవనాలు, ఇతర ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రతను నిర్వహించడంలో స్థానిక అధికారులు ఎంత ప్రభావితంగా ఉన్నారని మీరు అనుకుంటున్నారు ?
- మీ మున్సిపాలిటీలో రెడ్యూస్, రీ యూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) చెత్త కేంద్రాలను గుర్తించిన విషయం మీకు తెలుసా ?
- మున్సిపాలిటీలో మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం శుభ్రం చేయడానికి లైసెన్స్‌లు పొంది ఆపరేటర్లను మాత్రమే నియమించుకోవాలని మీకు తెలుసా ?
- మీ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్స్‌లో శుభ్రత నిర్వహణపై ఎంత వరకు సంతృప్తి చెందారు ?
- మీరు ఎప్పుడైనా పారిశుద్ధ్య సమస్యలను స్థానిక అధికారులకు రిపోర్ట్ చేశారా ? దానిని ఏ విధంగా పరిష్కరించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ వివరాలు ఇలా..	
మొత్తం మార్కులు	12,500
ఓడీఎఫ్, వాటర్	1200
గార్బేజ్ ఫ్రీ సిటీ	1300
మిగిలిన అంశాలన్నింటికీ	10,000

అవగాహన కల్పిస్తున్నాం



తడి, పొడి చెత్త వేరు చేయు విధానంపై పారిశుద్ధ్య సిబ్బందికి ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఈ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొత్తం పది అంశాలపై వివరాలు తీసుకుంటున్నం. ఈ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలను తీసుకుంటాం. ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్(ఐఈసీ) కింద స్వచ్ఛ సర్వేక్షణ్‌ను రూ.40లక్షల వరకు మంజూరయ్యాయి. మార్చి చివరి వరకు సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్

తాగునీటి సమస్య రాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ: ప్రసుతం వేసవికాలంలో అధికారులు ముందస్తు ప్రణాళికతో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఎండలు పెరుగుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, దానివల్ల తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ఉన్న ట్యాంకులను వెంటనే శుభ్రపరిచి నీటితో నింపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులను చేపట్టాలన్నారు. అన్ని గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలన్నారు. ప్రస్తుతం రంజాన్ మాస ఉపవాసాలు కొనసాగుతున్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో తాగునీటిని అందించడంతోపాటు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశం ముడావత్ రవినాయక్, వినోద్‌నాయక్, ఆయూబ్, అంజాద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

‘విజేత’లో మెగా జాబ్‌మేళా



నిరుద్యోగులతో మాట్లాడుతున్న నెవ్లాండ్ ఫర్ ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ ప్రతినిధి

మిర్యాలగూడ: పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం నెవ్లాండ్ ఫర్ ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తెల్ల ధనుంజయ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నెవ్లాండ్ ఫర్ ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ ప్రతినిధులు మధుసూదన్, గణేష్ సహకారంతో కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించగా మొత్తం 28 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. వీరికి రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి 11 మంది ఎంపిక చేసి ఉద్యోగ నియామకపత్రాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకావొద్దు



మాస్టర్ మోటివేటర్ షఫీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శివర్ల వెంకటయ్య, గాయత్రి దంపతులు

హాలియా : విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోనుకావొద్దని మాస్టర్ మోటివేటర్ బ్రదర్ షఫీ అన్నారు. సోమవారం హాలియా పట్టణంలోని వీఎస్ఆర్ హైస్కూల్‌లో వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు నిర్భయంగా, ఆందోళన లేకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. పాఠశాలను వ్యాపార ఆలోచనలతో కాకుండా విద్యా సేవగా భావించి నిర్వహిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్యను అభినందించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్య, శివర్ల గాయత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకునూరి నారాయణ గౌడ్, గౌనీ రాజా రమేష్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన 108 వాహనం

త్రిపురారం : నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన 108 వాహనాన్ని అత్యవసర వైద్యసేవలకు సద్వినియోగం చేసుకోవాలని 108 వాహనాల ప్రోగాం మేనేజర్ నసీరుద్దీన్, జిల్లా మేనేజర్ మధు అన్నారు. సోమవారం నిడమనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన 108 వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిడమనూరు మండల వ్యాప్తంగా గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్య కేంద్రంలో 108 వాహనం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది యాదగిరి, ప్రతాప్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రదర్శనను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు

కొండమల్లేపల్లి : నల్లగొండలో ఈ నెల 14న జరిగే మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎదుల ఎల్లయ్య మాదిగ కోరారు. సోమవారం కొండమల్లేపల్లిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా ప్రదర్శనకు ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ జనాభా ప్రాతిపదికన శాస్త్రీయంగా జరగాలన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అశోక్ మృతి సీపీఎంకు తీరని లోటు

నల్లగొండ టౌన్ : 20వ వార్డు సీపీఎం శాఖ సభ్యుడు కొత్త అశోక్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. భవన నిర్మాణ పనులలో భాగంగా ప్లంబర్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన అశోక్ మృతదేహానికి ఆయన సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎండీ సలీం, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాక లింగయ్య, గుండాల నరేశ్, అద్దంకి నరసింహ, సైదాచారి, సరోజ, ఆరుణ పాల్గొన్నారు.

నేడు భక్త చింతామణి పౌరాణిక పద్యనాటకం

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో మంగళవారం రాత్రి 8 గంటలకు స్థానిక శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో ఆంధ్రా, తెలంగాణ కళాకారులు సంయుక్తంగా భక్త చింతామణి నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు, మాజీ సర్పంచ్ కోలాహలం కృష్ణంరాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు, మాజీ ఉపసర్పంచ్ శాంతి నరసింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు నాగయ్యాయాదవ్, పాతకోటి నాగయ్య, కొత్తూరు వెంకన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులుగా ఒక రోజు విధులు నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోటయ్య, ఉపాధ్యాయులు రవికుమార్, తులసి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఎదుట పాఠకుల ఆందోళన



నినాదాలు చేస్తున్న పాఠకులు, నిరుద్యోగులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలోని మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయానికి రెగ్యులర్ గ్రంథాలయ అధికారిని నియమించాలని, గ్రంథాలయంలో మౌలిక సవసతులు కల్పించాలని కోరుతూ సోమవారం పాఠకులు, నిరుద్యోగులు గ్రంథాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుత ఇన్‌చార్జి అధికారి సమయానికి రావడంలేదని.. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మంచినీటిని ఒక్కొక్కరు రెండు లీటర్ల కంటే ఎక్కువ తాగవద్దని వాటర్ ఫ్రిడ్జ్ వద్ద కాగితం రాసి పెట్టారని పేర్కొన్నారు. పేపర్లు సరిగా రావడం లేదన్నారు. అన్ని వసతులూ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాలి సోమేశ్వర్ రెడ్డి, గంగాధర్, గురునాథం, శ్రీనివాస్, చంద్రోశఖర్, నవీన్, అంజి, సతీష్, వెంకటేష్, ప్రసాద్, శ్రీకాంత్, సతీష్, శ్రవణ్, బాబు, శివకృష్ణ, బాలు తదితరులున్నారు.

దాతల సహకారం అభినందనీయం



హాలియా హైస్కూల్ విద్యార్థులకు దుస్తులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ కృష్ణమూర్తి

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు దాతలు సహకారం అందించడం అభినందనీయమని ఎంఈఓ గుండా కృష్ణమూర్తి అన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, హాలియా హైస్కూల్ ప్రథమ ప్రధానోపాధ్యాయుడు దివంగత ముడుంబై రామానుజాచార్యులు జయంతిని పురస్కరించుకుని ఎంఆర్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హాలియా హైస్కూల్ పూర్వ విద్యార్థి, డిప్యూటీ కలెక్టర్(హైదరాబాద్) వాడాల రాములు సహకారంతో సోమవారం విద్యార్థులకు దుస్తులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసి మాట్లాడారు. సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు కర్తవ్యంగా ఆర్థిక సహకారం అందించినప్పుడే మరింత సంపన్నులు అవుతారని తెలిపారు. వాడాల రాములు హైస్కూల్‌లో చదివే తల్లిదండ్రులు లేని 30 మంది పేద విద్యార్థులకు చేసిన సేవలను కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ జలీల్, షేక్ షరీఫ్, శైలజ, శ్రీదేవి, నక్క శేఖర్, వాడాల వెంకటయ్య, రవీంద్రచారి, ఖాజామైనోద్దీ న్, గంజి శ్రీను, లవకుమార్, అక్కయ్యబాబు, వెంకటయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి



సాగర్ రోడ్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులపై కార్మికులు ప్రత్యేక దృష్టిపెట్టాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ ఆదేశించారు. మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో సోమవారం పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రధాన రోడ్లతో పాటు ప్రతి వార్డులో డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే ఏ సమస్య ఉండదన్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందును ఉదయం వేళల్లోనే పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు ఓఆర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, శానిటరీ జవాన్లు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది



ప్రయాణికురాలికి బ్యాగ్ అందిస్తున్న ఏడీఎం, తదితరులు

దేవరకొండ: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగ్‌ను తిరిగి ఆమెకు అందజేసి అధికారుల ప్రశంసలు అందుకున్నారు కండక్టర్, డ్రైవర్. దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం మిర్యాలగూడ నుంచి దేవరకొండకు వస్తుంది. ఈ క్రమంలో మిర్యాలగూడలో ఓ ప్రయాణికురాలు బస్సు ఎక్కి కొండమల్లేపల్లి రాగానే తన బ్యాగ్‌ను బస్సులోనే మర్చిపోయి దిగిపోయింది. బస్సు దేవరకొండకు రాగానే బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగ్‌ను గుర్తించిన డ్రైవర్, కండక్టర్.. వెంటనే డిపో అధికారులకు తెలియజేశారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు ప్రయాణికులరాలి వివరాలు సేకరించి ఆమెకు బ్యాగ్ అందజేశారు. బ్యాగులో విలువైన వస్తువులు ఉన్నట్లు తెలిసింది. డ్రైవర్ అబ్బాస్ అలీ, కండక్టర్ క్రాంతిని అధికారులు అభినందించారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న బండ శ్రీశైలం

చండూరు (గట్టుప్పల్) : గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామంలో ఇళ్ల స్థలాలను నిరుపేదలకు అందజేయాలని అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. ఆయన అంతంపేట గ్రామంలో ఇళ్ల స్థలాలను పరిశీలించారు. అనంతరం పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ 1998లో ఇళ్ల స్థలాలను సర్వే నెంబర్ 6/ఉ. 5.02 ఎకరాలు 150 మందికి అధికారులు పట్టాలిచ్చి స్థలం చూపించారు. కానీ ఆ భూమిని తిరిగి తీసుకునేందుకు అధికారుల యత్నం సరైన పద్ధతి కాదన్నారు. గుర్తించిన లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించి యథావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొట్టు శివకుమార్, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి తులసి సైదులు, రాచమల్లు వెంకట్ రెడ్డి, దాసరి యాదయ్య, గొడ్డటి మల్లమ్మ, యాదయ్య, నరసింహ, సైదమ్మ పాల్గొన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి



త్రిపురారం మండల కేంద్రంలో కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయ కుమారి

త్రిపురారం : కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయ కుమారి మాట్లాడారు. వేసవి ఎండలు ప్రారంభం అయినందున నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి భగీరథ నీరు సకాలంలో అందుతుందో లేదో పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయంతో ఉండాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాకర్ రెడ్డి, ఎంపీఓ సుధీర్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి మృతి బాధాకరం



కృష్ణమూర్తికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, కాంగ్రెస్ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, గుడిపల్లి మాజీ సర్పంచ్ మారం కృష్ణమూర్తి మృతి బాధాకరం అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో మారం కృష్ణమూరి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, ప్రతాపరెడ్డి, ఏడుకొండల్‌యాదవ్, యుగేంధర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, శ్రీకాంత్, బిక్షమయ్య తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సోమవారం హైదరాబాద్‌లో మారం కృష్ణమూరి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పాతికేళ్ల తర్వాత ఒకే వేదికపైకి..



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో 1999–2000 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు పాతికేళ్ల తరువాత ఒకే వేదికపై కలుసుకున్నారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులు భిక్షపతి, నాగార్జునరెడ్డి, కవిత, సుహాసినిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పిచ్చమ్మ, పద్మ, వాణి, సంధ్య, ప్రణిత, సోములమ్మ, శ్రీదేవి, మట్టయ్య, సైదులు, నక్క ప్రసాద్, రవి, నాగేందర్, ప్రభాకర్, నాగయ్య, మహేష్, లక్ష్మణ్‌లు ఉన్నారు.